నిజం.. ఓటే ఆయుధం!

- కొండపి నియోజకవర్గంలో భారీ పోలింగ్
- 88.07 శాతంగా నమోదు


సింగరాయకొండ బాలికల ఉన్నత పాఠశాలలో బారులు తీరిన జనం (ఫైల్)

సింగరాయకొండ(మద్దిపూడి): నియోజకవర్గంలో ఓటర్లు ప్రజాస్వామ్య విలువ చాటి చెప్పారు. ఓటే ఆయుధమని నినదించారు. భారీ స్థాయిలో ఓట్లు పోల్ కావడంతో రాజకీయ పక్షలు సంతోషం వ్యక్తం చేశాయి. కొండపి నియోజకవర్గంలో ఈసారి జరిగిన సార్వత్రిక ఎన్నికలలో 88.07 శాతం ఓటింగ్ నమోదైంది. నియోజకవర్గంలో మొత్తం 2,39,609 ఓటర్లు ఉండగా అందులో పురుషులు 1,18,624 మంది, స్త్రీలు 1,20,982 మంది ఉన్నారు. కాగా 2,11,016 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషులు 1,04,949 మంది, స్త్రీలు 1,06,065 మంది వేశారు. అంటే 1,116 మంది మహిళా ఓటర్లు పురుషుల కంటే అధికంగా వినియోగించుకున్నారు. 2019 ఎన్నికల్లో నియోజకవర్గ స్థాయిలో 87.10 శాతం పోలింగ్ నమోదు కాగా.. గత ఎన్నికల కంటే ఈసారి 0.97 శాతం పెరిగింది. సోమవారం కొన్ని మండలాల్లో రాత్రి 9 గంటల వరకు పోలింగ్ జరిగింది. ఉదయం మందకొడిగా పోలింగ్ ప్రారంభం కాగా.. మధ్యాహ్నం 1 గంటకు కేవలం 52 శాతం, మూడు గంటలకు 61 శాతం ఓటింగ్ జరిగింది. ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ బూత్‌ల వద్ద క్యూ లైన్లలో బారులు తీరిన ఓటర్లు మధ్యాహ్నానికి పలచబడటంతో ఒకదశలో ఇరుపార్టీల వారు ఆందోళనకు గురయ్యారు. చివరికి సాయంత్రం 5 గంటల నుంచి ఒక్కసారిగా ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు రావడంతో కొన్ని చోట్ల రాత్రి 8 గంటలకు, మరి కొన్ని కేంద్రాల్లో రాత్రి 9 గంటల వరకు పోలింగ్ జరిగింది. మండలాల వారీగా పోలింగ్ సరళి చూస్తే మద్దిపూడి మండలంలో 31,534 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇది 91.94 శాతం, పొన్నలూరులో 30,371 ఓటర్లు వినియోగించుకోగా 89.56 శాతంగా నమోదైంది. జరుగుమల్లి మండలంలో 30,817 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 90.22 శాతంగా తేలింది. కొండపి మండలంలో 31,345 మంది అంటే 91.37 శాతం, టంగుటూరు మండలంలో 43,470 మంది అంటే 87.41 శాతం, సింగరాయకొండ మండలంలో 43,479 మంది వేయగా 81.72 శాతం నమోదైంది. నియోజకవర్గంలో మద్దిపూడి మండలం అత్యధికంగా 91.94 శాతం ఓటు నమోదుతో ఆధిక్యంలో ఉండగా సింగరాయకొండ మండలంలో అత్యల్పంగా 81.72 శాతం మాత్రమే ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. గత ఎన్నికల్లో కొండపిలో అత్యధిక పోలింగ్ శాతం 91.5గా నమోదైంది. ఓటర్ల వారీగా మద్దిపూడి మండలంలో పురుషులు 16,233 మంది, స్త్రీలు 15,301 మంది, పొన్నలూరు మండలంలో పురుషులు 15,202, స్త్రీలు 15,169 మంది, జరుగుమల్లి మండలంలో పురుషులు 15,336, స్త్రీలు 15,480 మంది, ఒక ట్రాన్స్‌జెండర్, కొండపి మండలంలో పురుషులు 15,466 మంది, స్త్రీలు 15,878, ఒక ట్రాన్స్‌జెండర్, టంగుటూరు మండలంలో పురుషులు 21,128 మంది, స్త్రీలు 22,342 మంది, సింగరాయకొండ మండలంలో పురుషులు 21,584 మంది, స్త్రీలు 21,895 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వృద్ధులు కూడా ఎండను లెక్కచేయకుండా ఓటు హక్కు వినియోగించుకోవటానికి ఆసక్తి చూపారు. జరుగుమల్లి మండలం నందనవనం గ్రామానికి చెందిన 105 సంవత్సరాల వృద్ధ మహిళ సుబ్బమ్మ ఓటు వేయడం విశేషం. మొదటి సారి ఓటు హక్కు లభించిన యువత బారులు తీరింది. వీరు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, పూనే తదితర ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు. ఈ ఎన్నికల్లో మహిళలు, వృద్ధులు అత్యధికంగా ఓటు హక్కు వినియోగించుకోవటం పట్ల వైఎస్సార్ సీపీ శ్రేణులు ఆనందోత్సాహాల్లో ఉండగా.. ప్రతిపక్ష టీడీపీ కూటమి ఆలోచనలో పడింది.

సంక్షేమానికి జై కొట్టారు

- పెరిగిన ఓటింగ్ సరళి
- 2019లో 82.25 శాతం నమోదు
- 2024లో 85.30 శాతం నమోదు

కనిగిరి రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో మండు టెండను సైతం లెక్క చెయకుండా ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టణంతో పాటు, పల్లెల్లో సైతం ఓటర్లు ఉదయం నుంచే క్యూకట్టారు. కనిగిరి నియోజకవర్గంలో 2,40,079 మంది ఓటర్లుండగా, 2,04,798 మంది 85.30 శాతం మంది) ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకున్నారు. 2019 ఎన్నికల్లో 82.25 శాతం ఓటు హక్కు వినియోగించుకోగా.. ఈ విడత 3 శాతం అదనంగా ఓటుహక్కు వినియోగించుకున్నారు.

సంక్షేమ పథకాలకు ఆకర్షితులై..

ఎన్నికల ఓటింగ్ సరళిని గమనిస్తే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలకు ప్రజలు జై కొట్టారని అర్థమవుతుంది. 2019 ఎన్నికల్లో మహిళలు 93,158 మంది ఓటు హక్కును వినియోగించుకోగా, 2024 ఎన్నికల్లో 1,00,259 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 2, 40,079 మంది ఓటర్లలో వారిలో 60 నుంచి 70 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలున్నాయి. 50శాతం వరకు మహిళా ఓట్లు ఉన్నాయి. ఈఎన్నికల్లో 1,18,710 మంది మహిళల ఓట్లు ఉండగా, వారిలో 1,00,259 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సామాజిక వర్గాలకు చెందిన వారి ఎక్కువ శాతం వైఎస్సార్ సీపీ వైపే మొగ్గు చూపారు. ప్రతి ఇంట్లో సంక్షేమ పథకాలు లబ్ధి జరగడంతోనే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకునేందుకు ఉదయం నుంచే మహిళలు బారులు తీరినట్లు విశ్లేషకులు చెప్తున్నారు.

2014 ఎన్నికల్లో పోలింగ్ శాతం

2014 ఎన్నికల్లో 2,07,632 మంది ఓటర్లు ఉండగా, 1,57,597 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

2019 ఎన్నికల్లో పోలింగ్ శాతం:

2019 ఎన్నికల్లో మొత్తం 2,31,981 మంది ఓటర్లు ఉండగా, వారిలో 1,90,730 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అందులో 97,572 మంది పురుషులు, 93,158 మంది మహిళలు ఓటుహక్కును వినియోగించుకున్నారు. మొత్తం 82.25 శాతం ఓట్లు పోలయ్యాయి.

2024 ఎన్నికల్లో పోలింగ్ సరళి ఇలా:

కనిగిరి నియోజకవర్గంలో 2,40,079 ఓట్లు ఉన్నాయి. ఎన్నికల్లో 2,04,798 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అందులో 1,04,532 మంది పురుషులు, 1,00,259 మంది మహిళలు, 7 ఇతరులు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

2019 ఎన్నికల్లో ఓటింగ్ సరళి మండలాల వారీగా ఇలా..

మండలం	మొత్తం ఓట్లు	పురుషులు	మహిళలు	పోలైన మొత్తం	శాతం
హెచ్ఎం పాడు	22776	9951	9282	19233	(84.44)
వెలిగండ్ల	26996	12111	11240	23351	(86.50)
సీఎస్‌పురం	32921	13370	12572	25941	(78.80)
కనిగిరి	69530	29595	28398	57993	(83.41)
పీసీపల్లి	28405	12372	11647	24019	(84.56)
పామూరు	51253	20173	20019	40192	(78.42)
మొత్తం	2,31,881	97572	93158	1,90,730	(82.25)

2024 ఎన్నికల ఓటింగ్ సరళి

మండలం	మొత్తం ఓట్లు	పోలైన మొత్తం ఓట్లు	పోలైన పురుషుల ఓట్లు	పోలైన మహిళల ఓట్లు	పోలింగ్ శాతం
హెచ్ఎంపాడు	23,463	20,642	10,570	10,072	87.97
వెలిగండ్ల	28,655	25,168	12,992	12,176	87.83
సీఎస్‌పురం	34,259	28,324	14729	13,595	82.67
కనిగిరి	72,763	62,242	31419	30,816	85.54
పీసీపల్లి	29,364	25,443	13,066	12,377	86.65
పామూరు	51 575	42,450	21,403	21,047	82.30
మొత్తం	2,40,079	2,04269	1,04179	1,00083	85.30

కనిగిరి నియోజకవర్గంలో అత్యధికంగా హెచ్ఎంపాడు 87.97 శాతం, వెలిగండ్లలో 87.83 శాతం నమోదు కాగా, పీసీపల్లిలో 86.65 శాతం, కనిగిరిలో 85.54 శాతం, సీఎస్‌పురంలో 82.67 శాతం, పామూరులో 82.30 శాతం అత్యల్పంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

పోటెత్తిన ఓటర్లు

- కందుకూరులో భారీగా పోలింగ్ శాతం నమోదు
- నియోజకవర్గంలో 2,28,913 మంది ఓటర్లకు గాను 2,03,637 ఓటు హక్కు వినియోగం
- 88.96 పోలింగ్ శాతం నమోదు
- 2019 ఎన్నికలతో పోల్చితే 2024 ఎన్నికల్లో పెరిగిన పోలింగ్ శాతం

కందుకూరు: సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు పెద్ద సంఖ్యలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా గంటల తరబడి క్యూలైన్‌ల్లో నిలబడి ఓటు వేశారు. ఓటుహక్కును వినియోగించుకునేందుకు హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై వంటి నగరాలతో పాటు, విదేశాల నుంచి పెద్ద ఎత్తున వలస ఓటర్లు స్వగ్రామాలకు తరలివచ్చి ఈ సారి ఓటు వేయడం గమనార్హం. దీంతో గతంలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గంలో భారీ పోలింగ్ శాతం నమోదైంది. నియోజకవర్గంలో మొత్తం 2,28,913 మంది ఓటర్లు ఉండగా 2,03,637 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గ పోలింగ్ శాతం 88.95శాతంగా నమోదైంది. అదే 2019 ఎన్నికల్లో 88.85 శాతం నమోదు కాగా, ప్రస్తుతం 2024 ఎన్నికల్లో కాస్త పెరిగి 88.95 శాతంగా నమోదైంది. అంటే దాదాపు 90శాతంగా ఈసారి పోలింగ్‌శాతం ఉంది. అలాగే 1963 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఉన్నాయి. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు కూడా కలుపుకుంటే మొత్తం నియోజకవర్గంలో 2,05,600ఓట్లు పోలైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. దీంతో మొత్తం మీద నియోజకవర్గంలో 89.81శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారుల గణాంకాలు చెప్తున్నాయి.

అత్యధికంగా కందుకూరు మండలంలో..

గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఓటర్లు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ప్రతి పోలింగ్ బూత్‌లోను భారీగా పోలింగ్ శాతం నమోదైంది. అత్యధిక పోలింగ్ శాతం కందుకూరు మండలంలో నమోదు కాగా, తక్కువగా కందుకూరు అర్బన్ పరిధిలో నమోదైంది. ఇంత భారీ స్థాయిలో ఎప్పుడూ పోలింగ్ జరగలేదని ఎన్నికల అధికారులు పేర్కొంటున్నారు. స్థానికంగా ఉన్న ఓటర్లతో పాటు వలస ఓటర్లు పెద్ద ఎత్తున తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రధాన రాజకీయ పార్టీలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించడంతో పాటు, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు బూత్‌వారీగా పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. అదే సందర్భంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్నికల అధికారులు కూడా పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. నగరాల నుంచి ప్రత్యేక రవాణా సౌకర్యాలు ఏర్పాటు చేసుకుని ఓటర్లు స్వగ్రామాలకు చేరుకుని ఓటు హక్కును వినియోగించుకున్నారు. నగరాల్లో ఉన్న ప్రతి ఒక్కరూ గ్రామాలకు చేరుకోవడంతో ప్రస్తుతం గ్రామాలు కళకళాడుతున్నాయి. అదే సందర్భంలో కందుకూరు పట్టణం రెండు రోజుల నుంచి కితకితలాడుతుంది. పెద్ద ఎత్తున కార్లు రావడంతో పట్టణంలో ట్రాఫిక్ విపరీతంగా పెరిగిందని, గతంలో సంక్రాంతి లాంటి పండుగ సందర్భంలోను ఇంతగా జనాలు స్వగ్రామాలకు రాలేదేనే విశ్లేషణలు వెలువడుతున్నాయి.

పెరిగిన పోలింగ్‌శాతం ఏ పార్టీకి లాభం

ప్రస్తుతం నియోజకవర్గంలో దాదాపు 90శాతం పోలింగ్ నమోదు కావడంతో పెరిగిన పోలింగ్ శాతం ఏ పార్టీకి అనుకూలంగా పడిందనే దానిపై పెద్ద ఎత్తున రాజకీయ వర్గాలతో పాటు, సాధారణ ప్రజల్లో విస్తృతంగా సాగుతుంది. ప్రధాన రాజకీయ పార్టీలు ఎవరి అంచనాల్లో వారు మునిగిపోయారు. బూత్‌వారీగా లెక్కలు వేసుకుని గెలుపుపై అంచనాలు వేసుకుంటున్నారు.

అయితే 2019లో నియోజకవర్గంలో పెద్ద ఎత్తున నమోదైన పోలింగ్ శాతం వైఎస్సార్‌సీపీకి పూర్తి అనుకూలంగా ఉందని, 2024లోను అదే జరిగి ఉంటుందని వైఎస్సార్‌సీపీ శ్రేణులు స్పష్టం చేస్తున్నారు. పెరిగిన పోలింగ్ శాతం ఖచ్చితంగా ప్రభుత్వ అనుకూల ఓటింగేనని స్పష్టం చేస్తున్నారు. దీంతో నియోజకవర్గంలో మరోసారి వైఎస్సార్ సీపీ భారీ విజయం సాధిస్తుందనే అంచనాలు వెలువడుతున్నాయి.

మండలం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పురుషులు	మహిళలు	పోలింగ్‌శాతం
వలేటివారిపాలెం	35,274	31,932	15,816	16,116	90.53
లింగసముద్రం	30,953	28,015	14,096	13,919	90.51
కందుకూరు రూరల్	30,605	27,983	13,985	13,998	91.43
కందుకూరు అర్బన్	47,437	40,147	19,461	20,676	84.64
గుడ్లూరు	39,760	35.977	18,067	17,910	90.49
ఉలవపాడు	44,890	39,583	19,808	19,775	88.18
	2,28,913	2,03,637	1,01,233	1,02,394	88.96

ఓటేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు

- బుర్రా మధుసూదన్ యాదవ్

కందుకూరు: దాదాపు రెండు నెలల పాటు తనకు ఎన్నికల ప్రక్రియ సహకరించిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు వైఎస్సార్ సీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పోలింగ్ రోజు పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓటు హక్కు వినియోగించుకున్న ఓటర్లకు అభినందనలు తెలిపారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా నియోజకవర్గంలో ఓటర్ల తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని, ఇది ప్రజల్లో వస్తున్న చైతన్యానికి నిదర్శనమన్నారు. నియోజకవర్గంలో పెరిగిన పోలింగ్ శాతం కచ్చితంగా ప్రభుత్వ అనుకూల ఓటు అని, నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ విజయం సాధించడం తథ్యమనే ధీమాను ఆయన వ్యక్తం చేశారు. పార్టీ కోసం రెండు నెలల పాటు అవిశ్రాంతంగా శ్రమించిన ప్రతి ఒక్కరికీ ఆయన అభినందనలు తెలిపారు.

విద్యుత్ కార్యాలయం ముట్టడి


కొండపి విద్యుత్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు

కొండపి (సింగరాయకొండ): గత మూడు రోజులుగా తమ కాలనీ విద్యుత్ సమస్యను అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని కొండపి జగ్జీవన్ రాం కాలనీ వాసులు మంగళవారం కొండపి విద్యుత్ కార్యాలయాన్ని ముట్టడించారు. గత మూడు రోజుల నుంచి విద్యుత్ లేదని.. కొండపి విద్యుత్ ఏఈ కుంచాల కోటయ్యకు తెలపగా.. ఆయన దుర్భాషలాడారని ఆరోపించారు. ఏఈ కుంచాల కోటయ్య బయటకు వెళ్లినట్లు స్థానిక సిబ్బంది తెలిపారన్నారు. ఈ సమస్యను సింగరాయకొండ విద్యుత్ డీఈకి సమస్యను వివరించగా పరిష్కరిస్తానని తెలిపినట్లు వారు చెప్పారు.

పేదలకు దుస్తుల పంపిణీ

కందుకూరు: పట్టణంలోని శివారు ప్రాంతాల్లో నివసిస్తున్న పేదలకు షాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రెసిడెంట్ రహీం మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల నుంచి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శివారు ప్రాంతాల్లో ఉంటున్న పేదలకు ఆహారం, బియ్యం, కూరగాయలు పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఫౌండేషన్ ప్రతినిధులు నయీమ్‌భాషా, వెంకటేశ్వర్లు, గౌస్‌బాబు, కరిముల్లా, డాక్టర్ రాయ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు: పట్టణంలోని విప్పగుంట రోడ్డు విద్యుత్ లైన్ మరమ్మత్తుల కారణంగా పట్టణంలో బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ టీవి నరశింహం తెలిపారు. ఉదయం 6.30గంటల నుంచి 11.30గంటల వరకు పట్టణంలోని బలిజపాలెం, రూరల్ పోలీస్‌స్టేషన్ ఏరియా, కనిగిరి రోడ్, నాంచారమ్మ కాలనీ, సబ్‌కోర్టు ఏరియా, కోవూరు రోడ్, సాయినగర్, ఐఎస్‌రావు నగర్, విజయనగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

16న మండల సమావేశం

గుడ్లూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 16 వతేది గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎంపీపీ పులి రమేష్ అధ్యక్షతన జరిగే సమావేశానికి అన్ని శాఖల అధికారులు తమ శాఖల పూర్తి సమాచారంతో రావాలని ఎంపీడీఓ తెలిపారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

ఉరుములు, మెరుపులతో వర్షం

పామూరు: మండలంలో మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో ఓ మోస్తారు వర్షం కురిసింది. తీవ్ర ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతుండగా మోస్తారుగా కురిసిన అకాల వర్షంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడి ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. సోమవారం సాయంత్రం కూడా వర్షం కురవడంతో పొలాల్లో నీరు నిలిచింది. మండువేసవిలో వర్షం కురవడంతో అటు బత్తాయి, నిమ్మచెట్లు సాగు చేసిన రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

పొగాకు అత్యధిక ధర రూ. 300

కొండపి (సింగరాయకొండ): స్థానిక పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం నిర్వహించిన వేలంలో పొగాకు అత్యధిక ధర రూ. 300 పలికిందని వేలం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. ముప్పవరం, చోడవరం గ్రామాలకు చెందిన రైతులు 865 బేళ్ళను తీసుకొని రాగా 802 బేళ్ళు కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 63 బేళ్ళను తిరస్కరించారు. గరిష్ట ధర రూ. 300, కనిష్ట ధర రూ. 205, సరాసరి ధర రూ. 254.37 పలికింది. బుధవారం నిర్వహించిన వేలంలో 19 మంది పాల్గొన్నారు.